



# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



# 16

# మరో ఉగాది రచనల పోటీలా? - హోరి నాయనోయ్

అందరికీ దగ్గూ, రొంపా లాంటి చిన్న రోగాలు అప్పుడప్పుడూ వచ్చి, పలకరించి పోతూ ఉంటే, కొందరు కారణజన్ములకి సా.రో అనేది వస్తూ పోతూ ఉంటూ ఉంటుంది. ఈ సా.రో వచ్చిన వాళ్ళలో కొందరికి కథలు రాయాలనీ, మరి కొందరికి ఆ కథలని విమర్శించి అవతల పారేసి మంచి కథలు ఎలా రాయకూడదో అందరికీ చెప్పాలనీ ఉంటుంది. కొందరికి ఎల్లప్పుడూ నన్నయ్య, తిక్కన లని పొగడడం ఇష్టమైతే, మరికొందరు కష్టపడి విశ్వనాథ దాకా వస్తారు. ఇక గురజాడ, దేవులపల్లి, శ్రీశ్రీ, దగ్గరా ఆగిపోయిన వాళ్ళు కోకొల్లలు. ఆ మధ్య ఉ.సా.రో సోకిన చాలా మందికి ఇంకా అది పూర్తిగా పోలేదు. ఇక "యూతరం" వారికి ఉన్నది సి.సా.రో. వారికి కేవలం ఆత్రేయ, వేటూరి, సిరివెన్నెల, భువనచంద్ర, చంద్రబోసూ మొదలైన వారు మాత్రమే తెలుసు అని చాలా మంది అనుకుంటారు.

నా విషయంలో ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రితం కేన్సర్ లాగా గుటుక్కుమనేదాకా ప్రాణం తీసే ఈ సా.రో నాకు సోకి, తిష్ట వేసి, ఇంకా నన్ను పట్టుకుని వేళ్ళాడుతోంది. ఇది అమెరికాలో చూపించుకుంటున్నా కూడా తగని స్పెషల్ కేసు!... .సారీ...తగ్గని స్పెషల్ కేసు.

నాది స్పెషల్ కేసు అని ఎందుకు విన్నవించుకుంటున్నానూ అంటే జ్వరానికి ఉష్ణోగ్రత, చిన్న దురదకి పెద్ద గోకుడు లాగా నాకొచ్చిన సా.రో కి కొన్ని సింప్టమ్స్ ఉన్నాయి. ఇరవై ఏళ్ళ క్రితం ఒకానొక దుర్ముహుర్తాన ఏయిందంటే మనం రాసిన కథలు ఎవడికో పంపించి వాడి చేత తిట్లో, పొగడ్తలో "తినే" బదులు మనమే అందరి దగ్గర నుండీ కథలు, కవితలూ తెప్పించుకుని మన విలువైన అభిప్రాయాన్ని వారికి తెలిపితే మనమే ఒక పై మెట్టు మీద ఉన్నాం అనే ఫీలింగ్ వస్తుంది కదా అనే గొంతెమ్మ కోరిక నాకు కలిగింది. "సరేలే, నీ అభిప్రాయం ఎవడి కావాలి. బోడి అభిప్రాయం. నువ్వు ఏ రచయితని అయినా నీ కథ బావుంది అంటే నువ్వు వేళాకోళంగా తిడుతున్నావు అనుకుని లాగి లెంప కాయ కొడతాడు. నీ కవిత బాగా లేదు అంటే నువ్వు నిజంగానే విమర్శిస్తే నీ బుర్రకి అర్థం

అవదులే అని జాలి పడతాడు. ఎందుకొచ్చిన గొడవ. 'బుర్ర' మూసుకుని పడుకో " అని మా విక్టోరియా అర్థ రాత్రి పూట తనదే అయిన పద్ధతిలో తీవ్రమైన అభ్యంతరం వ్యక్తం చేసి, వర్క్ కి వెళ్ళి పోయింది.

ఆ నాటి మా క్వీన్ విక్టోరియా టెంకి జెల్ల దెబ్బకి చిన్నప్పుడు రేడియో కానీ, కొన్ని సార్లు కార్లు కానీ, పని చెయ్యడం మానేస్తే లాగి ఒక్కటుచ్చుకుంటే ఠకీమని పని చెయ్యడం మొదలుపెట్టినట్టు నా మెదడు తీవ్రంగా స్పందించి, మరో దిక్కుమాలిన ఆలోచన బుర్రలో మెదిలింది. అదేమిటంటే ఉట్టినే మీ కథలు, కమామీషులూ నాకు పంపించమనే బదులు మనం కూడా అమెరికాలో ఓ కథల పోటీ పెట్టి, బహుమతితో పాటు దక్షిణ కూడా ఇస్తాం అంటే గొప్ప వాళ్ళూ, గొప్పలు చెప్పుకోదల్చుకున్న వాళ్లు మొదలైన వీరాధి వీరులు పోటీలకి దిగుతారు కదా అప్పుడు నా అభిప్రాయాలు విచ్చల విడిగా చెప్పుకోవచ్చును అనేదే ఆ దిక్కుమాలిన ఆలోచన. దక్షిణ అనే దగుల్బాజీ "ఐడియా" కనిపెట్టిన వాడు నిజంగానే జీవితాలని మార్చేశాడు కదా! ఇక్కడ గొప్ప వాళ్ళు అంటే డబ్బున్న వాళ్ళు ఎంతమాత్రం కాదు అని ఒక వివరణ ఇవ్వాలి. ఎందుకంటే కథలూ, కమామీషులూ రాసుకుంటూ ఉండే వాళ్ళ దగ్గర డబ్బు ఎందుకుంటుందీ...నా లాగే ఉంటారు కదా! ఇక ఆ రోగం అంతటితో ఆగకుండా అర క్షణం లోనే కవితలకీ, వ్యాసాలకీ కూడా పోటీ పెట్టి పారేద్దాం అని కంప్యూటర్ వైరస్ లాగా వ్యాపించింది. అందుకే ఇరవై ఏళ్లయినా నా మెదడు అనే ఆపరేటింగ్ సిస్టం కి సోకిన ఆ ఐశ్వర్యారాయ్ వైరస్ ని ఎన్ని సార్లు క్లీన్ చేసినా ప్రతీసారి లాగే ఈ ఉగాదికీ ఈ జాడ్యం తన్నుకు వస్తుంటే 'వెర్రి హస్బెండూ, నీకు పట్టుకున్నది మదర్ బోర్డ్ కి మాధురీ దీక్షిత్ వైరస్ లాంటిదోయ్. దాన్ని మొత్తం తీసి బయట పారేసి కొత్తది వెయ్యాల్సిందే" అంది మా క్వీన్ విక్టోరియా.

ఈ ఉగాది పోటీలు పెట్టాలి అనే రోగ మూలాలు నా చిన్నప్పుడు అన్ని పత్రికల వాళ్ళూ "దీపావళి కథల పోటీ" –మొదటి బహుమతి "వంద రూపాయలు మరియు మా పత్రిక వార్షిక చందా పై పావలా తగ్గింపు" అనో, "సంక్రాంతి నవలల పోటీ" మొదటి బహుమతి ఐదు వందల రూపాయలూ మరియూ సినిమా తీయు అవకాశాల కొరకు ఇద్దరు నిర్మాతలతో పరిచయాలు" అనుకుంటూ వచ్చే ప్రకటనలే. క్రిందటి సారి ఆదివిష్ణు ఫస్ట్ ప్రైజ్ కొట్టేశాడు కదా, ఈ సారి సింగరాజు కో, వాకాటి పాండురంగారావుకో ఇస్తారులే అనో అందరం కుతూహలం గా ఎదురు చూసే వాళ్ళం. ఈ కథలు, నవలల పోటీలలో ఏ పత్రికలో ఎవరికీ బహుమతి వచ్చినా అన్నీ అద్భుతంగా ఉండేవి. ఎందుకనో కవితల పోటీలు ఎక్కువగా చూసిన జ్ఞాపకం నాకు లేదు. బహుశా ఇప్పటి లాగే అప్పుడూ వీధికి అరడజను కవులు ఉండే వారు కాబట్టి కవితల పోటీలు పెట్టడానికి హడిలిపోయే వారేమో మరి! ఆ రోజుల్లో రోడ్డు మీద చిన్న పిల్లలు ఎక్సర్ సైజ్ పుస్తకం పట్టుకుని వెళ్తుంటే, ఆపి చాక్లెట్లు ఇచ్చే వారు. అదే ఎవరైనా పెద్ద వారు అలాంటి ఎక్సర్ సైజ్ పుస్తకం పట్టుకుంటే పట్టుబడకుండా పరిగెట్టేవారు అందరూ.

ఈ పోటీలు నిర్వహించడం భలే సరదాగా ఉంటుంది. ఇక రచయితలలో భలే తమాషా వాళ్ళు కూడా ఉంటారు. ఆ మాట కొస్తే మొత్తం రచయితలు అందరినీ ముచ్చటగా మూడు రకాలుగా విభజించవచ్చును. మొదటి రకం "అవమాన రకం". ఈ రకం రచయితలందరూ అసలు ఏ పోటీకైనా ఎవరైనా రచనలు పంపించడం అవమానకరంగా భావించే రకం. "అదేమిటీ, ఉగాది పోటీలో

మీకు బహుమతి వచ్చింది అని తెలిసింది. మీరు ఇప్పటికే పేరున్న రైటర్ కదా. మీకు అంత ఖర్మ ఎందుకు పట్టిందీ?" అని ఒక ప్రఖ్యాత రచయిత మరొక ప్రఖ్యాత రచయితతో అనడం నేను స్వయంగా విన్నాను. అసలు విషయం ఏమిటంటే తీరా పోటీలో పాల్గొన్నాక వాళ్లకి ప్రైజ్ రాక పోతే వాళ్ళ బండారం బయటపడిపోతుంది అని భయం. ఈ రకం వారి అవమాన భారం తగ్గించడానికి "దక్షిణ" మొత్తం ఏకంగా పెంచెయ్యడమే! అప్పుడు వారు దయతో దిగి వచ్చి పోటీలో పాల్గొంటారు. ప్రైజ్ వస్తే సరే కానీ, లేకపోతే చస్తే నోరు మెదపరు.

ఇక రెండో రకం "గిజ గిజ రకం" . అంటే వీళ్ళు కాస్తో, కూస్తో పేరున్న రచయితలే కానీ యింకా పేరు రావాలంటే ఎక్కడో అక్కడ పోటీలలో బహుమతులూ, కాసిన్ని శాలువలూ, సన్మానాలూ కావాలి. డబ్బిచ్చి చేయించుకునే ఉత్తుత్తి సన్మానాలూ, శాలువాలకీ "వార్తా విలువ" అంటే న్యూస్ వేల్యూ మహా అయితే ఒక వారం ఉంటుంది. కానీ ఏ 'చచ్చు' పోటీలో వారి రచనకి బహుమతి వచ్చినా ఈయనా , ఆయనా ..అంటే రచయిత గారూ, ఆ పోటీ పెట్టిన సంస్థ తాలూకు సన్మాన కర్త కలకాలం చెప్పుకోవచ్చు. సన్మానం చేసిన వాడు కర్త అయితే చేయించుకున్నవాడు సన్మాన ఖర్మ అని శాస్త్రం చెప్తోంది కదా! ఉదాహరణకి ఆ మధ్య ఒక సన్మాన ఖర్మ గారు కానపడగానే సన్మాన కర్త గారు "1988 లో మీ "చస్తే చావు" అనే కథకి మా సంస్థ మూడో బహుమతి ఇచ్చి బతికించింది గుర్తుందా" అని అడగగానే ఆయన బుర్ర గోక్కుని "అవునవును, మా ఆవిడ ఇప్పటికీ అది తల్చుకుంటూ ఉంటుంది. అదే ఆవిడ మొదటి సారి నాతో బాటు స్టేజ్ ఎక్కి శాలువా కప్పిం'చుకోవడం. మీ ఫోటో కూడా మా దేవుడి గదిలో ఉంది. కానీ "చస్తే చావు" ఒక్క కాపీ కూడా ఎక్కడా లేదు. మీ దగ్గరేమైనా... " అని మొదటాయన బుర్ర కెలకబోయాడు. ఇలాంటి కేటగిరీనే "పరస్పర గోకుడు" అనే విభాగం అని కూడా అనవచ్చును.

ఇక మూడో రకం "ఓ రాయి విసురుదాం" అనే రకం. ఈ రకం రచయితలకి ఎప్పుడూ, ఏదో వ్రాద్దామనే తపన ఉంటుంది, కానీ "రాసి ఏం చేస్తాం, ఎవడు వేసుకుంటాడూ, వాటీజ్ ది యూజ్" అనుకునే రచయితలు ఏదో ఒక పాత రాయినో ..అంటే ఎప్పుడో వ్రాసినా ఎక్కడా ప్రచురణకి నోచుకోని రచననో, లేదా ఒక కొత్త రాయి ...అంటే ఇదేదో అవకాశం వచ్చింది కాబట్టి కొత్తది ఏదైనా రాద్దాం అని ఈ పోటీకోసం వ్రాసిన రచనని పంపించే వారు ఈ కోవలోకి వస్తారు. వీళ్ళలోనే కొందరు "రిసైకిల్" స్పెషలిస్ట్ లు కూడా ఉంటారు. ఉదాహరణకి ఒకాయన గత ఇరవై ఏళ్లగా ప్రతీ ఉగాది పోటీకీ ఒక ఉగాది కవిత పంపిస్తాడు. ఆ కవితలో మొదటి వాక్యం మాత్రమే కొత్త సంవత్సరం పేరుని బట్టి మారుతూ ఉంటుంది. మధ్యలో ఉన్న అరడజను వాక్యాలూ అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ అవే. ఉదాహరణకి:

ఏ ఏటి మొదటి వాక్యం: రావమ్మా జయమ్మా రావమ్మా, శుభాలన్నీ నా ఒక్కడికే తేవమ్మా

క్రిందటేడు మొదటి వాక్యం: రావమ్మా విజయమ్మా రావమ్మా, శుభాలన్నీ నా ఒక్కడికే తేవమ్మా

నాలుగేళ్ల క్రితం మొదటి వాక్యం: రావమ్మా విరోధి నామా, అశుభాలన్నీ పక్కింటి వాడికిచ్చి పోవమ్మా

ఇక మధ్య వాక్యాలలో ఏమీ మార్పు ఉండదు:

గాదె కింద పంది కొక్కులకు ఏం తెలుసు ఉగాది పచ్చడి రుచి

గార్ధభకంఠులకు ఎలా వచ్చును కోకిలలా పాడడం

అమెరికా వాడికేం తెలుసు కొత్తావకాయ ఘాటు..ఎట్సెసేటారా

ఈ కవిపుంగవుడికి ఉగాది పురస్కారం కాదు కానీ గిన్నిస్ బుక్ లోకి ఎక్కే అర్హతలు ఉన్నాయి.

ఇక తాము చాలా వరల్డ్ ఫేమస్ అనుకునే రచయితలు కొంతమంది ఉంటారు. ఒకసారి పోటీకి ఒక కథ ఈ-మెయిల్ లో ఈ క్రింది విధంగా వచ్చింది.

*ఫ్రం: దిష్టిపిడతఃజి.మెయిల్.కాం*

*ఉగాది పోటీకి నేను రాసిన "నేను" కథ అటాచ్మెంట్ లో ఉంది.*

*ఉంటాను.*

*రావు*

తీరా ఈ కథ బావుండి చచ్చి, బహుమతి ఇద్దామనుకున్నాం అనుకోండి. ఈ "రావు" అనే దిష్టిపిడత గారు ఈ ఖగోళంలో ఏ గోళంలో ఉంటాడో పట్టుకోడం బ్రహ్మతరం కూడా కాదు. అంతకీ బరితెగించి వివరాలు పంపించమని ఈ-మెయిల్ ఇవ్వగానే "ఇది ఆముదాలవలసలో ఉన్న ఇంటర్నెట్ కఫే. మా దగ్గరకి కథలు వ్రాసే దిష్టిపిడతలు చాలా మందే వస్తూ ఉంటారు. ఎంత మందినని గుర్తెట్టుకోం?" అని రావు గోపాలరావు టైపులో సమాధానం వచ్చింది.

ఇక పురస్కారాలు ప్రకటించాక అప్పుడప్పుడు "కుమ్మక్కు", "మేచ్ ఫిక్సింగ్" లాంటి ఆరోపణలు నిర్వాహకులకి వస్తూ ఉంటాయి. అలాంటి ఆరోపణలు ఎదుర్కొలేకా, అంత చాకిరీ చెయ్య లేకా అమెరికాలో పెద్ద సంఘాలు ఆంధ్రప్రదేశ్ లో ఏదో ఒక పత్రికతో సంయుక్తంగా రచనల పోటీలు నిర్వహించడం మొదలుపెట్టారు. అది ఉభయ తారకంగా ఉంది. ఎందుకంటే అమెరికా వాడి డబ్బుతో తమ పత్రికలలో వేసుకోడానికి ఆయా పత్రికల వారికీ మంచి రచనలు వస్తున్నాయి కదా!

ఎవరు ఏమనుకున్నా నేను అమెరికాలో ఉగాది పోటీలు పెట్టడానికి అసలు, సిసలు కారణం కొత్త రచనలనీ, రచయితలనీ ప్రోత్సహించడానికే. గత ఇరవై ఏళ్ల లోనూ చాలా మంచి రచనలూ వచ్చాయి, మంచి రచయితలూ పుట్టుకొచ్చి నిలదొక్కుకున్నారు. కొంత మంది చెప్పుకుంటారు. కొంతమంది దాక్కుంటారు. ఈ ఏటి 19వ ఉగాది పోటీలకి ఐదు దేశాల నుంచి (అమెరికా, కెనడా, ఇండియా, ఇంగ్లండ్, జర్మనీ) ల నుంచి 200 మంది కి పైగా రచయితలు సుమారు 250 కొత్త కథలు, కవితలూ పంపించి దిగ్విజయం చేశారు. అది చాలదూ ఈ బక్క ప్రాణి కి బ్రహ్మానందం కలగడానికీ?

అన్నట్టు అనేక మంది కోరుకున్నట్టు మా క్వీన్ విక్టోరియా అరికాలు మడమ సర్జరీ అయ్యాక బాగానే కోలుకుంటూ, కుంటుకుంటూ "ఏమిటీ, ఏదో, సా.రో, ఉ.సా.రో, సీసా.రో అనుకుంటూ ఏదేదో రాస్తున్నావూ" అని అడిగింది నా కంప్యూటర్ లోకి దొంగతనంగా చూస్తూ.

“ఓ అదా....అది నీకు లేదులే...సా.రో అంటే సాహిత్య రోగం...అలాగే ఉ.సా.రో అంటే ఉద్యమ సాహిత్య రోగం, సి.సా.రో అంటే సినిమా సాహిత్య రోగమూ .ఇలాగ దీనికి ఎన్ని రకాలుగా అయినా అన్వయించుకో వచ్చును” అన్నాను.

“ఓ అదా.... నీకున్న అసలు రోగం .....సా.రో అంటే ..సారా రోగం గురించి రాసుకుంటున్నావేమో అనుకున్నాను” అని నిట్టూరుస్తూ సోఫా మీద చతికిల పడింది మా క్వీన్ విక్టోరియా.

ఆయా రచయితలకీ, తెలుగు సాహిత్యాభిమానులకీ, పాఠకులకీ నా నూతన సంవత్సర శుభాకాంక్షలు.

COMMENTS